క్లుప్తంగా

30న వైజ్ఞానిక ప్రదర్శన

మైదుకూరు: మైదుకూరులో ఈనెల 30న మండల స్థాయి వైజ్ఞానిక ప్రదర్శన నిర్వహిస్తున్నట్లు ఎంఈఓ పద్మలత ఒక ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వ, ప్రైవేట్, రెసిడెన్షియల్ పాఠశాలల్లో శనివారం పాఠశాల స్థాయి వైజ్ఞానిక ప్రదర్శన నిర్వహించి మండల స్థాయి ప్రదర్శన కోసం ఎంపిక చేస్తారని ఎంఈఓ పేర్కొన్నారు. 30న మైదుకూరులోని జిల్లా పరిషత్ బాయ్స్ హైస్కూల్‌లో మండల స్థాయి వైజ్ఞానిక ప్రదర్శన నిర్వహిస్తామన్నారు. అందులో ఎంపిక చేసిన ప్రాజెక్టులను జనవరి 3న జరిగే జిల్లా స్థాయి ప్రదర్శనకు పంపుతామని తెలిపారు.

ప్రపంచ తెలుగు రచయితల మహాసభలకు ఆహ్వానం

ప్రొద్దుటూరు: విజయవాడ కొత్తపేట కేబీఎస్ కళాశాలలో ఈ నెల 28, 29వ తేదీలలో నిర్వహించే ఆరో ప్రపంచ తెలుగు రచయితల మహా సభలకు పట్టణానికి చెందిన ప్రముఖ రచయిత డాక్టర్ ఎం.ప్రభాకర్‌కు ఆహ్వానం లభించింది. ప్రారంభోత్సవ కార్యక్రమంలో ప్రొద్దుటూరుకు చెందిన కవి సగబాల రాజన్న రచించిన పుస్తకాల సంపుటి, రచించిన గ్రంథాలను తాను ఆవిష్కరించనున్నట్లు ఎం.ప్రభాకర్ తెలిపారు.

జాబ్ మేళా

ప్రొద్దుటూరు కల్చరల్: స్థానిక కొర్రపాడు రోడ్డులోని జ్యోతి ఫుడ్స్ ఇండస్ట్రీ ఆధ్వర్యంలో నిర్వహించిన జాబ్ మేళాకు విశేష స్పందన లభించింది. పరిసర ప్రాంతాలకు చెందిన 700 మంది అభ్యర్థులు పాల్గొన్నారు. టీడీపీ రాష్ట్ర కార్యదర్శి నంద్యాల కొండారెడ్డి, జ్యోతి ఫుడ్స్ ఇండస్ట్రీ నిర్వాహకుడు జక్కా పెద్దన్నలు మాట్లాడుతూ తమ సంస్థ ద్వారా నిరుద్యోగులకు ఉపాధి కల్పించేందుకు జాబ్ మేళా నిర్వహించినట్లు తెలిపారు.

డాక్టరేట్ ప్రదానం


పి.షబానాబి

ప్రొద్దుటూరు కల్చరల్: మండలంలోని సాయి రాజేశ్వరి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇంజినీరింగ్ కళాశాలలో ఎంబీఏ డిపార్ట్‌మెంట్ అధ్యాపకురాలు పి.షబానాబీకి చెన్నైకి చెందిన వెల్‌టెక్ యూనివర్సిటీ డాక్టరేట్ ప్రదానం చేసింది. 'ఇన్‌ఫ్లూయెన్స్ ఆఫ్ పర్సెప్షన్ అండ్ ఎక్స్‌పెక్టేషన్ ఆన్ డెసిషన్ మేకింగ్ టూవర్డ్స్ సెలక్షన్ ఆఫ్ ఎంప్లాయర్ బ్రాండింగ్ విత్ రిఫరెన్స్ టు ద ఫైనల్ ఇయర్ ఇంజినీరిగ్ స్టూడెంట్స్' అంశంపై చేసిన పరిశోధనలకు డాక్టరేట్ లభించింది. ఈ సందర్భంగా శుక్రవారం అధ్యాపకురాలు పి.షబానాబీని ప్రిన్సిపల్ డాక్టర్ పాండురంగన్ రవి, చైర్మన్ బసిరెడ్డి రాజేశ్వరరెడ్డి, వైస్ ప్రెసిడెంట్ వీరకుమార్‌రెడ్డి, కరస్పాండెంట్ వీరకల్యాణ్‌రెడ్డి, వైస్ ప్రిన్సిపాల్ వెంకటేశ్వరరెడ్డి అభినందించారు.

రేపు కోటి నామ పారాయణం

ప్రొద్దుటూరు కల్చరల్: స్థానిక అగస్త్యేశ్వర స్వామి ఆలయంలో ఆదివారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2.30 వరకు సామూహిక లలితా కోటి నామ పారాయణం చేస్తున్నట్లు పారాయణ కమిటీ అధ్యక్షుడు బూతూరు వెంకట రామిరెడ్డి పేర్కొన్నారు. ప్రెస్‌క్లబ్‌లో విలేకరులతో ఆయన మాట్లాడుతూ లోక కళ్యాణార్థం వేయి మంది భక్తులతో పారాయణం నిర్వహిస్తున్నామన్నారు. పాల్గొనే భక్తులకు అల్పాహారం, అన్నప్రసాద వినియోగం ఉంటుందన్నారు. విద్యాపీఠం మౌనస్వామి, ఎమ్మెల్యే నంద్యాల వరదరాజుల రెడ్డి, ఆలయ చైర్మన్ కొత్తమిద్దె రఘురామిరెడ్డి తదితరులు పాల్గొంటారన్నారు. ఈ సమావేశంలో మాతృశ్రీ రత్నమ్మ పాల్గొన్నారు.

రేపు ఫిట్, ఫన్, ఫుడ్ కార్యక్రమం

ప్రొద్దుటూరు కల్చరల్: స్థానిక అనిబిసెంట్ మున్సిపల్ హైస్కూల్ మైదానంలో ఆదివారం ఉదయం ఏడు గంటల నుంచి పది గంటల వరకు ఫిట్, ఫన్, ఫుడ్ కార్యక్రమం నిర్వహించనున్నట్లు ప్రిన్సిపల్ రవీంద్ర తెలిపారు. ప్రెస్ క్లబ్‌లో జరిగే ఈ కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్లను ఆయన ఆవిష్కరించారు. విద్యార్థుల తల్లిదండ్రులకు పోటీ లు నిర్వహించి బహుమతులు అందిస్తామన్నా రు. అడ్మినిస్ట్రేషన్ డైరెక్టర్ శ్రీనివాసులురెడ్డి, డైరెక్టర్ లోహిత్ రెడ్డి పాల్గొన్నారు.

ప్రతి సమస్యను పరిష్కరిస్తాం

ప్రొద్దుటూరు రూరల్: రెవెన్యూ సదస్సుల్లో భూ సమస్యలను పరిష్కరిస్తామని తహసీల్దారు గంగయ్య పేర్కొన్నారు. మండలంలోని తాళ్లమాపురంలో శుక్రవారం రెవెన్యూ సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి గ్రామంలో రైతుల సమస్యలను తమ దృష్టికి తీసుకొస్తున్నారన్నారు. 45 రోజుల్లో స్పెషల్ డ్రైవ్ నిర్వహించి పరిష్కరిస్తామని తెలిపారు. సదస్సులో 15 అర్జీలు రైతుల నుంచి వచ్చినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో సాయినాథరెడ్డి, సుదర్శన్, నాగమోహన్‌రెడ్డి, నరసింహస్వామి, పాల్గొన్నారు.

చెత్తను ఎప్పటికప్పుడు శుభ్రంచేయాలి

ప్రొద్దుటూరు: మున్సిపాలిటీ పరిధిలో చెత్తను ఎప్పటికప్పుడు శుభ్రం చేయాలని మున్సిపల్ కమిషనర్ వి.మల్లికార్జున సూచించారు. మున్సిపాలిటీల్లోని పలు వార్డుల్లో జరుగుతున్న పారిశుద్ధ్య పనులను శుక్రవారం ఆయన పర్యవేక్షించారు. శ్రీనివాసనగర్‌లో ఇంటింటా చెత్త సేకరణ, తాగునీటి సరఫరా, వీధి దీపాల సమస్యలపై అక్కడి ప్రజలను అడిగి తెలుసుకున్నారు. వాస్తు కాంప్లెక్స్, విద్యా వికాస్ స్కూల్ వద్ద చెత్తను తొలగించాలని శానిటరీ అధికారులను ఆదేశించారు. కొత్తి మున్సిపల్ హైస్కూల్ వెనుక వైపున మురికి కాలువలో పేరుకుపోయిన షీల్ట్‌ను తొలగించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ వి.సుబ్బరాయుడు, 16వ వార్డు సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

విద్యుత్తు చార్జీలు తగ్గే వరకూ పోరాటం

- బిల్లులు పెంచి ప్రజలను మోసం చేశారు
- వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి రాచమల్లు శివప్రసాద్‌రెడ్డి
- లాంతర్లతో విద్యుత్తు బిల్లులపై ప్రజల నిరసన
- ప్రొద్దుటూరులో వైఎస్సార్‌సీపీ భారీ ర్యాలీ


లాంతరు నెత్తిమీద పెట్టుకొని నిరసన తెలుపుతున్న రాచమల్లు శివప్రసాద్‌రెడ్డి, పార్టీ నాయకులు

ప్రొద్దుటూరు క్రైం: పెంచిన విద్యుత్తు చార్జీలు తగ్గించే వరకూ పోరాటం ఆగదని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి, మాజీ ఎమ్మెల్యే రాచమల్లు శివ ప్రసాద్‌రెడ్డి అన్నారు. కూటమి ప్రభుత్వం విద్యుత్తు చార్జీలు పెంచినందుకు నిరసనగా ప్రొద్దుటూరులో భారీ ర్యాలీ చేపట్టారు. వసంతపేట సాయిబాబా గుడి నుంచి శుక్రవారం ఉదయం ర్యాలీ కొనసాగింది. లాంతర్లను చేతపట్టుకొని కూటమి ప్రభుత్వం, చంద్రబాబునాయుడుకు వ్యతిరేకంగా పార్టీ నాయకులు నినాదాలు చేశారు. రామేశ్వరం రోడ్డు, గాంధీ రోడ్డు, పవర్‌హౌస్ రోడ్డు మీదుగా ట్రాన్స్‌కో డీఈ కార్యాలయం వరకు ర్యాలీగా వెళ్లారు. రాచమల్లు శివప్రసాద్‌రెడ్డి మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఏర్పడితే ఐదేళ్ల వరకూ విద్యుత్తు చార్జీలు పెంచమని చంద్రబాబునాయుడు చెప్పారన్నారు. అధికారంలోకి వచ్చిన తర్వాత రూ.16వేల కోట్ల భారం ప్రజలపై మోపారని విమర్శించారు. రాబోయే ఐదేళ్ల కాలం పూర్తయ్యే నాటికి రూ.1000 వస్తున్న బిల్లు రూ.4 వేలకు చేరే అవకాశం ఉందన్నారు. ఇచ్చిన మాటకు కట్టుబడి విద్యుత్తు చార్జీల పెంపు ఉపసంహరించుకోవాలని సూచించారు. లేని పక్షంలో వ్యతిరేకత ఏర్పడి విద్యుత్తు కార్యాలయాలను ప్రజలు చుట్టుముట్టే పరిస్థితి ఏర్పడుతుందన్నారు. ఇదే పరిస్థితి కొనసాగితే కరెంట్ బిల్లులు కట్టవద్దని పిలుపునివ్వాల్సి వస్తుందని రాచమల్లు హెచ్చరించారు. వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వంలో ఎస్సీ, ఎస్టీలకు 200 యూనిట్ల వరకు ఉచితంగా ఇచ్చారన్నారు. ఇపుడు పాత బిల్లులు కట్టమని వారిని ఇబ్బంది పెట్టడం తగదన్నారు. చార్జీలు తగ్గించే వరకూ ఉద్యమం కొనసాగుతుందని హెచ్చరించారు. అనంతరం ట్రాన్స్‌కో డీఈ శ్రీనివాసులురెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్ భీమునిపల్లె లక్ష్మీదేవి, పార్టీ రాష్ట్ర అదనపు కార్యదర్శి పోరెడ్డి నరసింహారెడ్డి, జెడ్పీ వైస్ చైర్‌పర్సన్ జేష్టాది శారద, మున్సిపల్ వైస్ చైర్మన్ బంగారుమునిరెడ్డి, ఎంపీపీ సానబోయిన శేఖర్‌యాదవ్, పార్టీ నాయకులు కల్లూరు నాగేంద్రారెడ్డి, శెట్టిపల్లె ప్రభాకర్‌రెడ్డి, వరికూటి ఓబుళరెడ్డి భీమునిపల్లె నాగరాజు, సర్పంచ్‌లు, కౌన్సిలర్లు, పార్టీ నాయకులు, ప్రజలు పాల్గొన్నారు.


మైదుకూరు: ఏపీఎస్‌పీడీసీఎల్ ఈఈ భరణి కృష్ణకు వినతి పత్రం అందిస్తున్న మాజీ ఎమ్మెల్యే రఘురామిరెడ్డి


బద్వేలు : ర్యాలీలో పాల్గొన్న వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు రవీంద్రనాథ్‌రెడ్డి, తదితరులు

బద్వేలులో..

బద్వేలు/బద్వేలు అర్బన్: బద్వేలు : పట్టణంలోని వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయం నుంచి నాలుగు రోడ్ల కూడలి మీదుగా విద్యుత్ కార్యాలయం వరకు శుక్రవారం సాగిన ర్యాలీలో వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు పి.రవీంద్రనాథరెడ్డి, ఎమ్మెల్యే దాసరి సుధ, ఎమ్మెల్సీ డీసీ గోవిందరెడ్డి, మున్సిపల్ చైర్మన్ రాజగోపాల్‌రెడ్డి, నియోజకవర్గ, మండల స్థాయి నాయకులు, కార్యకర్తలు, ప్రజలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా రవీంద్రనాథ్ రెడ్డి మాట్లాడుతూ సూపర్ సిక్స్ పథకాల పేరు చెప్పి ఎన్నికల్లో లబ్ధిపొందిన ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు విద్యుత్ చార్జీలు పెంచనని చెప్పి ఇప్పుడు విద్యత్ చార్జీలు రెండింతలు చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. చార్జీలు తగ్గించేవరకు పోరాటం చేస్తామన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ యువ నాయకులు దేవసానిఆదిత్యరెడ్డి, నియోజకవర్గ బూత్‌కన్వీనర్ల సమన్వయకర్త కె.రమణారెడ్డి, మున్సిపల్ చైర్మన్ రాజగోపాల్‌రెడ్డి, మాజీ కుడా, సోషల్‌వెల్ఫేర్ బోర్డు చైర్మన్లు గురుమోహన్, పులిసునీల్ కుమార్, వైఎస్సార్‌సీపీ నగర విభాగం రాష్ట్ర అధ్యక్షుడు బంగారుశీనయ్య, మున్సిపల్ వైస్ చైర్మన్ సాయిక్రిష్ణ, జెడ్పీటీసీలు చిన్నపోలిరెడ్డి, ముత్యాలప్రసాద్, అంకనగురివిరెడ్డి, వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శులు రామసుబ్బారెడ్డి, అందూరురామకృష్ణారెడ్డి, పోలిరెడ్డి, ఆయా కార్పొరేషన్ల మాజీ డైరెక్టర్లు డాక్టర్ కళ్యాణ్‌చక్రవర్తి, బాలమునిరెడ్డి, మల్లికార్జున రెడ్డి, మాధవరెడ్డి, ఆయా మండలాల కన్వీనర్లు మల్లేశ్వర్‌రెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, సి.బాషా, మల్లికార్జునరెడ్డి, చిత్తారవిప్రకాష్‌రెడ్డి, రామకృష్ణారెడ్డి, రాజశేఖర్‌రెడ్డి, హనుమంతరెడ్డి, ఆయా మండలాల, మున్సిపాలిటీ ముఖ్య నేతలు పుత్తాశ్రీరాములు, సుబ్బారెడ్డి, శివయ్య, యోగానందరెడ్డి, ఓ.ప్రభాకర్‌రెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డి, సగిలిసుదర్శన్, సింగరయ్య, రాజీవ్‌బాష, రవిచంద్రారెడ్డి, పుల్లయ్య, హరికృష్ణారెడ్డి, వెంకటసుబ్బారెడ్డి, బ్రహ్మానందరెడ్డి, మల్లికార్జునరెడ్డి, చెన్నకృష్ణారెడ్డి, ప్రతాప్‌రెడ్డి, శంకర్‌రెడ్డి, రమేష్‌బాబు, సుబ్బరాజు, నాగేశ్వరరావు, మౌలాలి, షఫి, నారాయణరెడ్డి, కుప్పాలరమణ, శ్రీరాములు, రవికుమార్‌రెడ్డి, గురుమూర్తి, నర సింహులు, చిత్తాశేఖర్‌రెడ్డి, గురివిరెడ్డి, థామస్, సింగరయ్య, సుదర్శన్‌లతో పాటు ఆయా వార్డుల కౌన్సిలర్లు, ఇన్‌చార్జిలు, ఆయా పంచాయతీల సర్పంచ్‌లు, పెద్ద ఎత్తున పార్టీ శ్రేణులు పాల్గొన్నారు.

ప్రజల నెత్తిన శఠగోపం పెట్టిన కూటమి ప్రభుత్వం: మాజీ ఎమ్మెల్యే శెట్టిపల్లె రఘురామిరెడ్డి

మైదుకూరు: ప్రజలపై కూటమి ప్రభుత్వం శఠగోపం పెట్టిందని మైదుకూరు మాజీ ఎమ్మెల్యే శెట్టిపల్లె రఘురామిరెడ్డి అన్నారు. కూటమి ప్రభుత్వం విద్యుత్ చార్జీలు పెంచినందుకు నిరసనగా వైఎస్సార్‌సీపీ మైదుకూరులో శుక్రవారం నిర్వహించిన పోరుబాట కార్యక్రమం విజయవంతమైంది. స్థానిక వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో తొలుత గురువారం మాజీ ప్రధాన మంత్రి మన్మోహన్ సింగ్ చిత్రపటానికి మాజీ ఎమ్మెల్యే రఘురామిరెడ్డి పూలమాల వేసి నివాళులు అర్పించారు. అక్కడి నుంచి నియోజకవర్గానికి చెందిన నాయకులు, కార్యకర్తలు వెంట రాగా ర్యాలీగా బయల్దేరి స్థానిక ఆర్టీసీ బస్టాండ్ వద్దకు చేరుకున్నారు. అక్కడున్న దివంగత నేత వైఎస్ రాజశేఖర రెడ్డి విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. అనంతరం పెంచిన విద్యుత్ చార్జీలు తగ్గించాలి, ఇచ్చిన మాట తప్పిన కూటమి ప్రభుత్వం దిగిపోవాలి.. అంటూ నాయకులు, కార్యకర్తలు నినాదాలు చేస్తూ స్థానిక నంద్యాల రోడ్డులో ఉన్న విద్యుత్ డివిజన్ కార్యాలయం వద్దకు చేరుకున్నారు. కార్యాలయంలో ఏపీఎస్‌పీడీసీఎల్ ఈఈ భరణి కృష్ణకు పెంచిన విద్యుత్ చార్జీలను వెంటనే తగ్గించాలని కోరుతూ వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే రఘురామిరెడ్డి మాట్లాడుతూ విద్యుత్ చార్జీల పెంపుపై రాష్ట్ర వ్యాప్తంగా వినియోగదారుల్లో, ప్రజల్లో కూటమి ప్రభుత్వంపై వ్యతిరేకత వచ్చిందని ఆరోపించారు. ఆరు మాసాల్లోనే కూటమి ప్రభుత్వం ప్రజలపై బాదుడు మొదలు పెట్టిందని ధ్వజమెత్తారు. మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎస్సీలకు 200 యూనిట్ల మేరకు ఉచిత విద్యుత్‌ను అందిస్తే చంద్రబాబు దానిని కూడా నీరుగార్చారని ఆరోపించారు.

రెడ్ బుక్ రాజ్యాంగం నడుస్తోంది

రాష్ట్రంలో రెడ్ బుక్ రాజ్యాంగం నడుస్తోందని రఘురామిరెడ్డి ధ్వజమెత్తారు. కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలను ఏ ఒక్కటీ నెరవేర్చలేదని విమర్శించారు. రైతులకు రైతు భరోసా, అమ్మ ఒడి, మహిళలకు ఉచిత బస్సు అమలు చేయలేదన్నారు. కార్యక్రమంలో ఎంపీపీలు వీరనారాయణరెడ్డి, జయచంద్రారెడ్డి, లక్ష్మయ్య, రెడ్యం వెంకటసుబ్బారెడ్డి, ఏవీ సుబ్బారెడ్డి, వైస్ ఎంపీపీ రఘురామిరెడ్డి, వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు కేపీ లింగన్న, నాయకులు గల్లా నరసింహారెడ్డి, మదీనా దస్తగిరి, శ్రీమన్నారాయణరెడ్డి, బండి నాగేంద్ర ప్రసాద్, మున్సిపల్ వైస్ చైర్మన్ మహబూబ్ షరీఫ్, భరత్ కుమార్‌రెడ్డి, ఓబుళ కొండారెడ్డి, శంకర్‌రెడ్డి, పద్మనాభరెడ్డి, గుడిపాడు బాబు, రెడ్యం చంద్రశేఖర్‌రెడ్డి, రాజశేఖర్‌రెడ్డి, గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి, డీఎల్ శ్రీనివాసరెడ్డి, మురళీ మోహన్‌రెడ్డి, ఇర్షాద్, ఖాదర్, షాషా, ట్రాక్టర్ గౌస్, బండి నాగేంద్ర, రఘురామయ్య, కౌన్సిలర్ వెంకట సుబ్బన్న, గోవిందు రవి, ప్రశాంత్ రెడ్డి పాల్గొన్నారు.

అభ్యంతరాలు ఉంటే ఫిర్యాదు చేయాలి


సచివాలయాల్లో జాబితాను పరిశీలిస్తున్న మున్సిపల్ కమిషనర్ నరసింహారెడ్డి

బద్వేలు అర్బన్: మున్సిపాలిటీ పరిధిలోని ఆయా సచివాలయాల్లో ప్రదర్శించిన ఎస్సీ కులానికి చెందిన జాబితాలో ఏవైనా అభ్యంతరాలు ఉంటే సంబంధిత ప్రజలు ఫిర్యాదు చేయాలని మున్సిపల్ కమిషనర్ వి.వి.నరసింహారెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం పట్టణంలోని పలు సచివాలయాలను తనిఖీ చేసిన ఆయన మాట్లాడుతూ గతంలో నిర్వహించిన క్యాస్ట్ సర్వేలో భాగంగా ఎస్సీ కులానికి సంబంధించిన జాబితాను ఆయా సచివాలయాల్లో ప్రదర్శించడం జరిగిందని, అందులో ఏవైనా అభ్యంతరాలు ఉంటే ఈ నెల 30వ తేదీలోపు సచివాలయంలో ఉన్న అడ్మిన్ సెక్రటరీకి గాని రెవెన్యూ సెక్రటరీకి గాని తెలపాలని కోరారు.

మొండి బకాయిదారులకు రెడ్ నోటీసులు

మున్సిపాలిటీ పరిధిలోని మొండి బకాయిదారులకు రెడ్ నోటీసులు జారీ చేయనున్నట్లు మున్సిపల్ కమిషనర్ వి.వి.నరసింహారెడ్డి తెలిపారు. పట్టణంలో జరుగుతున్న పన్ను వసూలు కార్యక్రమాన్ని పరిశీలించి సిబ్బందికి సూచనలిచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇంటి, నీటి పన్నులు పెండింగ్‌లో ఉన్న టాప్ వంద మందిని గుర్తించి ఇప్పటికే వారికి కూడా నోటీసులు అందజేశామని తెలిపారు. ఈ నెలాఖరులోపు పన్నులు చెల్లించినట్లైతే ఎటువంటి అపరాధ రుసుము పడదనే విషయంపై ప్రజలకు అవగాహన కల్పించాలని కోరారు. అలాగే మున్సిపల్ కార్యాలయంలో పట్టణ ప్రణాళిక విభాగం సిబ్బందితో సమావేశం నిర్వహించి సూచనలు ఇచ్చారు. కార్యక్రమంలో మున్సిపల్ ఆర్ఓ రఘునాథరెడ్డి, మున్సిపల్ ఆర్ఐ షఫి, టౌన్‌ప్లానింగ్ ఆఫీసర్ సతీష్, టీపీబీఓలు, ప్లానింగ్ సెక్రటరీలు, పట్టణ ప్రణాళిక సిబ్బంది పాల్గొన్నారు.

మన్మోహన్ సింగ్ మరణం దేశానికి తీరని లోటు


మన్మోహన్ సింగ్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న రవీంద్రనాథ్‌రెడ్డి, గోవిందరెడ్డి, డాక్టర్ సుధ

బద్వేలు అర్బన్: భారత మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ మృతి దేశానికి తీరనిలోటని వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు పి.రవీంద్రనాథ్‌రెడ్డి, ఎమ్మెల్సీ డీసీ గోవిందరెడ్డి, ఎమ్మెల్యే డాక్టర్ దాసరి సుధలు తెలిపారు. శుక్రవారం స్థానిక నెల్లూరు రోడ్డులోని వైఎస్సార్‌సీపీ కార్యాలయం ఆవరణలో మన్మోహన్ సింగ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించి రెండు నిమిషాలు మౌనం పాటించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆర్‌బీఐ గవర్నర్‌గా, ఆర్థికమంత్రిగా ఉన్న సమయంలో ఎన్నో ఆర్థిక సంస్కరణలు చేపట్టి దేశాన్ని ప్రగతిపథంలో నిలిపిన మహోన్నత నాయకుడు మన్మోహన్ సింగ్ అని అన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ యువ నాయకులు దేవసాని ఆదిత్యరెడ్డి, నియోజకవర్గ బూత్‌కన్వీనర్ల సమన్వయకర్త కె.రమణారెడ్డి, మున్సిపల్ చైర్మన్ రాజగోపాల్‌రెడ్డి, మాజీ కుడా చైర్మన్ గురుమోహన్, మాజీ సోషల్‌వెల్ఫేర్ బోర్డు చైర్మన్ పులిసునీల్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

బ్యాంకింగ్ పరీక్షలకు ఉచిత శిక్షణ


కరపత్రాలను ఆవిష్కరిస్తున్న జేవీవీ నాయకులు

ప్రొద్దుటూరు కల్చరల్: జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో జనవరి 1వ తేదీ నుంచి బ్యాంకింగ్ పరీక్షలకు ఉచితంగా శిక్షణ ఇవ్వనున్నట్లు జేవీవీ రాష్ట్ర కార్యదర్శి తవ్వా సురేష్ తెలిపారు. స్థానిక జేవీవీ కార్యాలయంలో వాటికి సంబంధించిన కరపత్రాలను ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నందినీ క్లాత్ మార్కెట్‌లోని జేవీవీ కార్యాలయంలో రోజూ ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంటల వరకు, మధ్యాహ్నం 2 నుంచి 6 గంటల వరకు అనుభవజ్ఞులైన అధ్యాపకులతో శిక్షణ ఇస్తామని వివరించారు. ఈ అవకాశాన్ని నిరుద్యోగులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఆసక్తిగల అభ్యర్థులు 9705333305 నంబర్‌కు సంప్రదించి పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జేవీవీ పట్టణ కార్యదర్శి సునీత, రవిబాబు, అఫ్రోజ్, హర్షిత, చంద్రకళ, పవన్, రాకేష్ తదితరులు పాల్గొన్నారు.

30న వాహనాల వేలం

ప్రొద్దుటూరు క్రైం: వివిధ కేసుల్లో పట్టుబడిన వాహనాలను ఈ నెల 30న ప్రొద్దుటూరు ఆర్టీసీ బస్టాండు ఆవరణలో వేలం వేయనున్నట్లు ప్రొద్దుటూరు ఆర్టీఓ మురళీధర్ ఓ ప్రకటనలో తెలిపారు. ప్రొద్దుటూరు ఆర్టీసీ డిపో ఆవరణలో లారీలు, స్కూల్ బస్సు, మ్యాక్సీ క్యాబ్‌లు, ఆటోలు, అలాగే జమ్మలమడుగు ఆర్టీసీ డిపోలో మ్యాక్సీ క్యాబ్‌లు, ఆటోలు, బైక్‌లు తదితర 25 వాహనాలకు వేలం ఉంటుందన్నారు. ఆసక్తి ఉన్న వారు కార్యాలయ పని వేళల్లో వెళ్లి పరిశీలించుకోవచ్చని చెప్పారు. ఒక్కొక్క వాహనానికి ధరావత్తు రూ.5వేలు చెల్లించాలన్నారు. వేలంలో కొనుగోలు చేసిన వాహనానికి అదే రోజు 50 శాతం ధరావత్తు చెల్లించాలని, మిగతా మొత్తాన్ని ఏడు రోజుల్లో జీఎస్టీతో కలిపి చెల్లించాల్సి వస్తుందని తెలిపారు. వివరాలకు ప్రొద్దుటూరు ఆర్టీఓ కార్యాలయంలో సంప్రదించాలని ఆర్టీఓ పేర్కొన్నారు.

నగరవనంపై అధికారులకు నివేదిక

సాక్షి ఎఫెక్ట్..

ప్రొద్దుటూరు క్రైం: ప్రొద్దుటూరులో నగరవనం పనులకు సంబంధించి అధికారులకు నివేదిక పంపించినట్లు ఎఫ్ఆర్ఓ హేమాంజలి తెలిపారు. ఈ నెల 20న సాక్షిలో 'ప్రొద్దుటూరు నగరవనానికి ఏమైంది' శీర్షికన కథనం ప్రచురితమైంది. వార్తకు స్పందించిన అధికారులు రాజీవ్‌గాంధీ నేషనల్ పార్కులో నగరవనం అభివృద్ధి పనుల కోసం ఉన్నతాధికారులకు నివేదిక సమర్పించినట్లు ఎఫ్ఆర్ఓ అన్నారు. అవసరమైన అనుమతులు రాగానే పనులను ప్రారంభిస్తామని పేర్కొన్నారు.

ఉత్తమ ఉపాధ్యాయుడు మృతి


బొల్లు సిద్దయ్య (ఫైల్)

పోరుమామిళ్ల: పోరుమామిళ్లకు చెందిన విశ్రాంత ఉపాధ్యాయుడు బొల్లు సిద్దయ్య(91) శుక్రవారం మృతి చెందారు. ఆయన 40 సంవత్సరాలు నియోజకవర్గంలో వివిధ పాఠశాల్లో పని చేసి, అన్ని గ్రామాల్లో ప్రజల ఆదరాభిమానాలు పొందారు. బ్రహ్మంగారిమఠంలో అన్నదానసత్రం స్థాపించడంలో కీలకపాత్ర పోషించారు. ఆయన మృతి వార్త తెలుసుకున్న పార్టీల నాయకులు నివాళి అర్పించారు. వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ అదనపు కార్యదర్శి నల్లేరు విశ్వనాథరెడ్డి సిద్దయ్య భౌతికదేహంపై పూలమాల వేసి నివాళి అర్పించారు.

సీపీఐ శతాబ్ది ఉత్సవాలను జయప్రదం చేయండి

బద్వేలు అర్బన్: సీపీఐ శతాబ్ది ఉత్సవాల్లో భాగంగా శనివారం కడప నగరంలో నిర్వహించనున్న భారీ ర్యాలీ, బహిరంగ సభను జయప్రదం చేయాలని ఆ పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యులు వి.వీరశేఖర్ పిలుపునిచ్చారు. శుక్రవారం స్థానిక సీపీఐ కార్యాలయం జెవిభవన్‌లో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ పార్టీ ఆవిర్భావం నుంచి నేటి వరకు బడుగు, బలహీన వర్గాల ప్రజల కోసం ఎన్నో వీరోచిత పోరాటాలు నిర్వహించి నిర్బంధాలు, కేసులను సైతం లెక్క చేయకుండా పోరాటాలు కొనసాగిస్తున్నామని, శతాబ్ది ఉత్సవాల స్ఫూర్తితో రాబోవు రోజుల్లో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలపై ఉద్యమిస్తామని తెలిపారు. సీపీఐ పట్టణ కార్యదర్శి బాలు, పట్టణ నాయకులు వెంకటేష్, ఓబులపతి, మోహన్‌రెడ్డి, రామసుబ్బారెడ్డి, నరసయ్య పాల్గొన్నారు.

ప్రైవేటు పాఠశాలలపై చర్యలు తీసుకోవాలి

ప్రొద్దుటూరు: పట్టణంలోని ప్రైవేటు స్కూళ్ల యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు రాహుల్ డిమాండ్ చేశారు. ఎంఈఓ సావిత్రిని శుక్రవారం ఆయన కలిసి వినతి పత్రం సమర్పించారు. ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా ఎడిషైలె స్కూల్ 2024–25 సంవత్సరానికి గానూ అడ్మిషన్లు చేసుకుంటున్నారన్నారు. ప్రభుత్వ విద్యా విధానం ప్రకారం జూన్– జూలై నెలలో అడ్మిషన్లు ప్రారంభం కావాలన్నారు. పట్టణంలో అనేక ప్రైవేట్, కార్పొరేట్ విద్యా సంస్థలు విద్యా విధానాలను ఉల్లంఘిస్తున్నాయని తెలిపారు.

కౌన్సిలర్, మాజీ కౌన్సిలర్ల సోదరులకు పోలీసుల కౌన్సిలింగ్


ఇరు వర్గాలను బైండోవర్ చేసిన పోలీసులు

ప్రొద్దుటూరు క్రైం: ప్రొద్దుటూరులో ఇటీవల రెండు సార్లు గొడవ పడిన అధికార టీడీపీకి చెందిన కౌన్సిలర్ మునీర్, మాజీ కౌన్సిలర్ జిలాని సోదరులకు పోలీసులు కౌన్సిలింగ్ ఇచ్చారు. డబ్బు బాకీ విషయమై ఈ నెల 23వ తేదీన 19వవార్డు కౌన్సిలర్ మునీర్, మాజీ కౌన్సిలర్ సోదరుడు మహమ్మద్ హుసేన్‌లు గొడవపడిన విషయం తెలిసిందే. ఈ ఘటనపై రూరల్ పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది. తర్వాత 24న కూడా జిన్నా రోడ్డులో కౌన్సిలర్ మునీర్, మహమ్మద్ హుసేన్ మధ్య గొడవ జరుగగా ఘటనపై టూటౌన్ పోలీస్‌స్టేషన్‌లో అదే రోజు కేసు నమోదైంది. డబ్బు బాకీ విషయమై వీరి మధ్య తరచూ గొడవ జరుగుతుండటంతో పోలీసులు శుక్రవారం కడపకు తీసుకెళ్లారు. పోలీసు అధికారులు తమదైన శైలిలో కౌన్సిలింగ్ ఇచ్చారు. ఈ కేసులో మునీర్, బషీర్‌లతో పాటు జిలాన్, మహమ్మద్ హుసేన్‌లను బైండోవర్ చేశారు.

అవి మట్కా డబ్బులే


మాజీ కౌన్సిలర్ జిలాన్‌కు కౌన్సిలర్ మునీర్ సోదరుడు బషీర్ డబ్బు బాకీ ఉన్నాడు. దీని కోసమే వారి మధ్య రెండు సార్లు గొడవ జరిగింది. ఏ విధంగా డబ్బు బాకీ ఉన్నాడని పోలీసులు ఆరా తీయగా మట్కా డబ్బులని స్వయంగా బషీర్ పోలీసులకు చెప్పినట్లు తెలుస్తోంది. మట్కా డబ్బు కోసమే వారి మధ్య గొడవ జరిగినట్లు తెలియడంతో పోలీసులు కేసు నమోదు చేయడానికి సిద్ధమైనట్లు విశ్వసనీయ సమాచారం. అయితే విషయం తెలిసిన అధికార పార్టీకి చెందిన ఒక నాయకుడు స్టేషన్ వద్దకు వచ్చినట్లు తెలుస్తోంది. కేసు లేకుండా చేయడానికి అతను పోలీసులతో రాయబారం నడుపుతున్నట్లు సమాచారం. వీరిపై పోలీసులు మట్కా కేసు నమోదు చేస్తారో లేదో వేచి చూడాల్సిందే.

జగన్‌పై దుష్ప్రచారం తగదు


వైఎస్సార్‌సీపీ నేత రెడ్యం వెంకటసుబ్బారెడ్డి

చాపాడు: పులివెందులలో వైఎస్ జగన్ క్యాంపు కార్యాలయం వద్ద వైఎస్సార్‌సీపీ అధినేత, మాజీ సీఎం వైఎస్ జగన్‌ను కలుసుకునేందుకు జనం ప్రభంజనంలా పెల్లుబికి వస్తే ఆ జన ప్రభంజనంలో జగన్‌ను కలిసేందుకు ఆరాటం ఎక్కువై కార్యకర్తల మధ్య తోపులాట జరిగితే ఎల్లోమీడియా జగన్ కార్యాలయంపై రాళ్లదాడి అని దుష్ప్రచారం చేయడం తగదని వైఎస్సార్‌సీపీ నేత, ఏపీఎస్ ఆర్టీసీ మాజీ జోనల్ చైర్మన్ రెడ్యం వెంకటసుబ్బారెడ్డి అన్నారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ క్యాంపు కార్యాలయం వద్ద తోపులాట జరిగిన సమయంలో తాను కూడా జగనన్న వద్దనే ఉన్న ఉన్నానని ఆ సమయంలో పోలీసులు సైతం అదుపుచేయలేని స్థితుల్లో తోపులాట జరిగిందని, దీనిని కూడా ఎల్లో మీడియా రాజకీయానికి వాడుకోవడం నీచ రాజకీయానికి పరాకాష్ట అన్నారు. ఇలాంటి దుష్ప్రచారం చేసే వారికి పుట్టగతులుండవని రెడ్యం హెచ్చరించారు.

క్రమశిక్షణకు మారుపేరు ఎన్‌సీసీ


ఎన్‌సీసీ అధికారి సురేంద్ర నాయక్‌కు స్వాగతం పలుకుతున్న హెడ్మాస్టర్ రామ్మోహన్, ఎన్‌సీసీ విద్యార్థులు

మైదుకూరు: ఎన్‌సీసీ క్రమశిక్షణకు మారుపేరని స్థానిక జిల్లా పరిషత్ బాయ్స్ హైస్కూల్ హెడ్మాస్టర్ గోశెట్టి రామ్మోహన్ అన్నారు. ఎన్‌సీసీ శిక్షణను పూర్తి చేసుకుని వచ్చిన పాఠశాలకు చెందిన అసోసియేట్ ఎన్‌సీసీ ఆఫీసర్ మూడే సురేంద్రనాయక్‌కు శుక్రవారం పాఠశాలలో హెడ్మాస్టర్ ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు, ఎన్‌సీసీ విద్యార్థులు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా హెడ్మాస్టర్ రామమోహన్ మాట్లాడుతూ మహారాష్ట్రలోని నాగపూర్ కమిటీ ఆఫీసర్స్ అకాడమీలో పాఠశాలకు చెందిన ఎన్‌సీసీ అధికారి సురేంద్రనాయక్ 45 రోజుల శిక్షణను పూర్తి చేసుకుని వచ్చారని తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు సూర్యనారాయణరెడ్డి, ఆవుల శ్రీనివాసులు, ఆనందరావు, తవ్వా ఓబుళరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బ్యాంకింగ్ రుణాలతో ఆర్థికాభివృద్ధి


మహిళలకు అవగాహన కల్పిస్తున్న డీసీసీబీ అధికారులు

ప్రొద్దుటూరు రూరల్: బ్యాంకు రుణాలను వినియోగించుకుని మహిళలు ఆర్థికాభివృద్ధి సాధించాలని డీసీసీ బ్యాంకు మేనేజర్ బిందు కోరారు. ప్రకాష్ నగర్‌లో బ్యాంకింగ్ సేవలపై మహిళలకు డీసీసీ బ్యాంకు అధికారులు శుక్రవారం అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ జిల్లా నలమూలలా తమ బ్యాంకుల ద్వారా వివిధ రకాల రుణాలను రైతులు, డ్వాక్రా మహిళలకు అందిస్తున్నామన్నారు. ఫిక్స్‌డ్, రికరింగ్ డిపాజిట్ పథకాలు అందుబాటులో ఉన్నాయన్నారు. ఈ కార్యక్రమంలో డీసీసీబీ అసిస్టెంట్ మేనేజర్ రాజశేఖరరెడ్డి, సూపర్‌వైజర్ ఉమామహేశ్వరరెడ్డి, యానిమేటర్లు లక్ష్మమ్మ, సుబ్బ లక్ష్మమ్మ, తదితరులు పాల్గొన్నారు.

క్యాన్సర్‌ను అరికట్టాలి

ప్రొద్దుటూరు రూరల్: ప్రాణాంతకమైన క్యాన్సర్ మహమ్మారిని అరికట్టేందుకు అందరూ సమష్టిగా కృషిచేయాలని ఎన్‌సీడీసీడీ నోడల్ అధికారి డాక్టర్ ఎస్.రమేష్ పేర్కొన్నారు. మండలంలోని కల్లూరు బీసీ కాలనీలో జరుగుతున్న ఎన్‌సీడీసీడీ3.0 కార్యక్రమాన్ని శుక్రవారం ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఇంటికీ వైద్యాధికారులు, సిబ్బంది తిరిగి క్యాన్సర్ స్క్రీనింగ్ చేయాలని సూచించారు. అనంతరం కల్లూరు ప్రాథమిక వైద్య ఆరోగ్య కేంద్రంలో రికార్డులను తనిఖీ చేశారు. వైద్యాధికారి డాక్టర్ మహాలక్ష్మి, డాక్టర్ మునిరాంప్రసాద్, రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.